# చిలక

వయసు ఇరవై రెండు. ఎత్తు ఐదు నాలుగు చురుకుగా నాజూకుగా అందంగా బొమ్మలా ఉంటుంది. అంత సన్నమూ కాదు. అలాగని ఒత్తిరీ కాదు. కళ్లు మిలమిలలాడుతూ ఏవేవో చిలిపి ఊహలు ప్రతిబింబిస్తూ ఉంటాయి. ఉత్సాహం చిందులేసే మతాబులాంటి పిల్ల అన్నపూర్ణ.

అన్నపూర్ణని పూర్ణిమ అని కొందరూ, అనూ అని కొందరూ, పూర్ణమ్మ అని కొందరూ పిలుస్తూంటారు. పూర్తి పేరు ఎమ్. అన్నపూర్ణ. మన్న పూర్ణా అని పిలిచినా అన్నపూర్ణ బాధపడదు. అదో తత్వం.

'జడివాన పడుతూ ఉంటే, రివ్వున రొజ్జగాలి వీస్తూ ఉంటే, కిటికీలు మూసేసి, ఫ్యాన్ ఒకటిలో పెట్టుకొని డన్‌లప్ బెడ్‌మీద రగ్గు కప్పుకొని పడుకుని ప్రక్కన ప్లేట్లో వేడి వేడి పకోడీలు నములుతూ, వెచ్చగా ఛేజ్ నవల చదువుతూ ఉంటే చెప్పలేని ఆ హాయిా ఎంతో వెచ్చగ ఉంటుందోయీా...' అంది అన్నపూర్ణ ఓ రోజున హోరున వాన కురుస్తూంటే వానలోకి చూస్తూ.

లంచ్ రిసెస్. పిల్లకాయలు క్యారియర్లూ, బాక్సులూ డబడబ శబ్దం చేస్తున్నారు.

''.... ఈ రెండో క్లాస్ బోరు ! నైన్త్ అయితే బాగుణ్ణు హాయ్ ! నీరజా ! నువ్ ఈ రోజు ఏం తెచ్చుకున్నావ్ ?''

అన్నపూర్ణ మాటలు నీరజ వింటూనే ఉంది.

'పులిహోర !'

'అబ్బ ! నాకెంత ఇష్టమో !' రెండు చెంచాలు నీరజ చెంచాతోనే తీసి నోట్లో వేసుకుంది.

'నువ్వంటే నాకు బోల్డు అసూయ. రోజూ ఏదో ఒక స్పెషల్! నిన్న పూరీ, మొన్న సొజ్జప్పాలు - నేను సాంబారన్నం లేకపోతే పెరుగన్నం అంతే ! గులాబ్ జామ్ చేద్దామనుకొన్నా కాని గోపాల్ లేకపోతే ఏమిటోనోయ్ స్వీట్ తినబుద్ధి కాలేదు.

నీరజకి అన్నపూర్ణ స్వగతాలు వినడం ఎంతో హాయి. మరో ఫ్లాష్ బ్యాక్ వినడానికి సిద్ధపడింది.

''క్వాలిటీలో, ఏం తీసుకుంటావ్ ?'' అన్నాడు గోపాల్. గోపాల్ గురించి నీరజకి ఆమె కలిసిన గంటలోనే చెప్పేసింది అన్నపూర్ణ. గోపాల్ ఇప్పుడు జిప్మర్‌లో ఉంటున్నాడు. పెళ్లయి ఏడాది దాటినా కాపురం పెట్టడం కుదరడం లేదు. జిప్మర్ అంటే తెలుసా ?''

''తెలీదు !''

''జవహర్లాల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ అండ్ రిసెర్చి ! జె.ఐ.పి.ఎమ్.ఏ.ఆర్.'' వివరాలు పూసగుచ్చింది.

''గోపాల్‌తో నీ పెళ్లి అయిందా ? మరి ఇంత దూరం...'' నీరజ మనసులో ప్రశ్న మెదలినా బయటికి రానివ్వకుండా పెదవులు బిగపట్టింది.

ఇంతలో అక్కడికి మూర్తి రానే వచ్చాడు.

'హలో అన్నపూర్ణగారూ ! ఏమిటో మినీ లెక్చర్ ! నేనూ వినవచ్చా !''

''వెల్‌కమ్ అండ్ వెల్‌కమ్ ! జిప్మర్ గురించి చెబుతున్నా. గోపాల్...''

''గోపాల్ ?''

''మై హస్బెండ్''

'' ఐసీ!'' మూర్తి బోల్డు డీలా పడిపోయాడు.

''కపిల్‌దేవ్ గవాస్కర్ కంటె ఎబెటర్ ప్లేయర్...... తర్డ్ టెస్టులో....'' అన్నపూర్ణ గోపాల్‌ని మరిచిపోయిందనిపించింది నీరజకి. మూర్తి వెళ్లిపోగానే అంది అన్నపూర్ణ. ''గోపాల్ కేవలం భర్త మాత్రమే కాదు. ప్రియుడు, సఖుడు. బాంధవుడు! తియ్యనిది తిననక్కరలేదు. చూస్తే చాలు, మెత్తనిది ముట్టుకుంటే, అందమైన రంగులు కనబడితే, సువాసన సోకితే నాకు గోపాల్ జ్ఞాపకం వస్తాడు. సెంటిమెంట్ అని కొట్టి పారేస్తే నేనేం చెయ్యలేను. వలపు అంత తియ్యటిదాన్ని కేవలం సెంటిమెంట్ అనేయడం నేరం'' గుండె చేత్తో రాసుకుంటూ అంటోంది అన్నపూర్ణ.

పెళ్లయి ముగ్గురు పిల్లల్ని కన్న ఓ ఆవిడ ఆమె వంక వింతగా చూస్తోంది.

వినికిడి ప్రాంతంలో ఉన్న జంట్స్ ఆమె నుంచి చూపు మరల్చుకోలేక, అలాగని కళ్లప్పగించి చూస్తూ ఉండనూ లేక తబ్బిబ్బు పడుతూంటే ఏమిటేమిటో ఆలోచనలు - కలగాపులగంగా.

నీరజకి అన్నపూర్ణ మాటలు వింటూంటే అందమైన కలకంటున్నట్టుంది.

క్లాసులు అయిపోయాయి. పిల్లలు రిక్షా లెక్కుతూ ఉంటే పర్యవేక్షిస్తున్నారు ప్రయివేట్ కాన్వెంటు టీచర్లు.

-''మా అత్తగారు నన్ను తిట్టుకుంటూ ఉంటారు. ఈ ఉద్యోగం చెయ్యడం దండగని ఆవిడ అభిప్రాయం...... నాలుగు వందలని కాదు. ఐలవ్ లిబర్టీ...... దిస్ ఈజ్ ది లైఫ్ ఐ లవ్!''

''అన్నపూర్ణ, చాలా రోజుల నుంచి అడుగుదామనుకొంటున్నాను. మా ఇంటికి రాకూడదూ! ప్లీజ్! ఈ రోజే:''

''నో, నో! రూమ్‌కి పోవాలి. ఈ రోజు గోపాల్ దగ్గర నుంచి లెటర్ డ్యూ!...... మరేం అనుకోకు! థాంక్స్ ఫర్ ఆస్కింగ్ మీ!'' అన్నపూర్ణ వడివడిగా వెళ్లిపోయింది.

సుమతి నీరజ దగ్గరకొచ్చింది.

-'' ఈవిడ విషయం కొంచెం చూసుకోవాల్సిందే! అత్తగారు వద్దంటూ ఉంటే, భర్త డాక్టరయితే, మామగారూ డాక్టరే అయితే అర్వై మైళ్ల దూరం వచ్చి ఇక్కడ ఈ ఉద్యోగం ఎందుకు చెయ్యాలి? అసలు కొంత మందిని మనం అర్థం చేసుకోలేం''.

''అర్థం చేసుకోవాలనుకోడమూ, ప్రయత్నం చెయ్యడమూ రెండు అవివేకమే! కాని ఈవిడంతా డాబు, బడాయి, ఫోజు, ఆమె మాటలకీ, చేతలకీ, ఆమె బ్రతుక్కీ పొంతన కుదరడం లేదు. రెండో క్లాస్ పిల్లలకి వర్క్ ఇచ్చేసి టేబుల్ మీద కాళ్లు పడేసి నవల చదువుకుంటోంది. నిజంగా పెళ్లయితే ఈ వన్నెలాడిని ఆ భర్త ..... అయినా మనకి ఇతరుల విషయాలు అనవసరం!'' సీనియర్ టీచర్ తెంచేసింది. ఆమె భర్త ఒక స్కూలుకి హెడ్ మాస్టరు. ఈవిడకి టీచర్ కావల్సిన అర్హతలు లేవు కాబట్టి ఒకరిని విమర్శించకూడదనుకుంటుంది. తెంచేసి ఠక్కున ప్రక్కకు తిరిగి చీర కుచ్చెళ్లు సర్దుకుంటోంది.

- ''నీరజా, నాకో రెండు వందలు కావాలి, ఇవ్వగలవా?''

''రెండు వందలే. మీ సదభిప్రాయానికి సంతోషం. కాని అన్నపూర్ణగారూ నేను ధనవంతురాలిలా కనపడుతున్నానా?''

''గారు అనకు లెద్దూ ! ఏదో అడిగా, జస్ట్ ఫర్ గెట్ ఇట్'' కలుసుకున్న మూడు రోజుల్లోనే వాళ్ల పరిచయం ఏకవచనంలోకి మొగ్గ తొడిగేసింది.

అన్నపూర్ణలో ఏదో ఆకర్షణ, ఏదో క్రొత్తదనం – ఏదో వింతదనం.... ప్రత్యేకత కొట్టవచ్చినట్టు. భళ్లున ఎండ వచ్చినట్లు కనపడతాయి. నీరజకి ఆమెని ఎన్నో ఎన్నెన్నో అడగాలని ఉంటుంది. కాని బిడియం – గుడ్‌మ్యానర్స్ అడ్డు వస్తాయి.

–''నీకు జ్వరమా ? స్కూలుకి రాకపోతే ఎందుకో అనుకొన్నాను. చెప్పకేం 'చూపు'లకి పెళ్లివారొచ్చారేమోననుకున్నాను సుమా ! మందు వేసుకున్నావా ?''

'' ఆఁ ! తలనొప్పి, ఒళ్లు నొప్పి, కాళ్లు పీకులు !''

''కాళ్లు పట్టనా ?''

ఆ చనువు, ఆ ఆత్మీయతకి నీరజ నీరైపోయింది. – '' ఆ అన్నపూర్ణలో ఏదో ఆకర్షణ ఉంది సుమా ! అటు మూర్తి, ఇటు జాన్సన్, సుబ్బారావు, రమణయ్య ఏ ఒక్కరూ ఆమెను ఒంటరిగా ఉండనివ్వరు. గలగలా ఆవిడ మాటాడేస్తూ ఉంటే నోళ్లు వెళ్లబెట్టి వింటూ మైమరచిపోతారు''.

– సునీల తన అసూయ, బాధ వెళ్లగక్కింది.

''వంద నోటు చిల్లర ఉందా ?'' మధుమతి వచ్చింది.

''సారీ ! నిన్న మధ్యాహ్నమే అన్నపూర్ణకిచ్చేశా !''

''అన్నపూర్ణకా ?''

'' ఏదో అర్జంటుగా కావాలంది. ఒక్కపది నా దగ్గర ఉంచుకొని ఉన్న నూరూ ఇచ్చేశా.''

''నిన్న సాయంకాలం స్మగుల్డ్‌లో దొరుకుతోందని ఎలక్ట్రానిక్ వాచ్ ఉన్న బాల్‌పెన్ కొంది నూరు రూపాయలిచ్చి. వాళ్లాయనకి బర్త్‌డే గిఫ్టట.''

ఈ మాటలు విన్న తర్వాత నీరజ క్లాసుకి వెళ్లిపోయింది. – ''హాయ్ ! నీరజా ! క్లాస్‌లోనే అలా గొంతు చించుకుంటూ కూర్చోపోతే అప్పుడప్పుడు బయటికి వస్తూ ఉండకూడదూ !''

క్లాస్ గుమ్మం దగ్గర నుంచుని అడిగింది.

''పాఠం చెబుతున్నా !''

''జస్ట ఎ మినిట్ ! చిన్న మాట, ఇలారా !'' నీరజ బయటకు వచ్చింది.

'' ఏం లేదు ఓ ఇరవై ఇస్తావా ? అర్జంటుగా కావాలి. పోస్టాఫీస్‌కి పంపుతున్నా నారాయణని.... దీన్ని పోస్ట్ చేయించాలి.'' పార్శిల్ చూపించింది.

ఇరవై నా దగ్గరలేవే !?''

''పోనీ ఓ పది ఇయ్యి.... గోపాల్‌కి పెన్, వాచ్ కొన్నా..... పంపాలి.....''

నీరజ పర్స్ తీసి నోట్లు, చిల్లరాలెక్కపెట్టింది.

''తొమ్మిదే ఉన్నాయ్ !''

''చాల్లే ఇలా ఇయ్ !''

అన్నపూర్ణ గబగబా స్టాఫ్ రూమ్ వంక వెళ్లిపోయింది. సాయంకాలం ఇంటికి వెళుతూ అడిగింది నీరజ.

'' ఈరోజు రాకూడదూ !''

'' ఓ, మీ ఇంటికా ? మరో రోజు వస్తా నీరజా, ఏమనుకోకు ! పిలిచే వాళ్లుంటే వెళ్లడానికి నాకేం అభ్యంతరం లేదు. కాని ఇవాళ సాయంకాలం బట్టలు లేవు. మూడు నాలుగు రోజుల నుంచి అనుకుంటున్నా ! ఈ చీర రెండోసారి కట్టాలంటే భలే చిరాకు... ఉతికి ఇస్త్రీ చేసుకోవాలి. ఏదో ఒక రోజు వస్తాగా.... పోనీ నువ్వే నారూమ్‌కి రాకూడదూ, ఆన్ ఎనీ డే యు ఆర్ వెల్‌కమ్ ! నేను ఈ ఊళ్లో రమ్మని ఆహ్వానించినది నిన్నొక్కర్తినే... ఐ లైక్‌యూ.... కొత్త కోవెల వీధిలో డాక్టర్ గారి పెద్దింటికి ఎదురుగా ఎత్తు అరుగుల ఇల్లుకు కుడివైపు భాగం, ప్లీజ్ కమ్ !''

–గబగబా వెళ్లిపోయింది అన్నపూర్ణ. బట్టల రేవు మధ్య నీరజకి ఆమెను డిస్టర్బ్ చెయ్యడానికి మనస్కరించలేదు.

మరి నాలుగు రోజులు పోయాక అటుగా వెళ్లాల్సి వచ్చి తలుపు కొట్టింది.

''వచ్చే ! ఎవరదీ ?'' లోపలనుంచి అడిగింది అన్నపూర్ణ.

''నీరజ !''

''హాయ్ ! రా !.....'' నీరజ లోపలికి వెళ్లగానే తలుపు గడియవేసింది.

నీరజ అన్నపూర్ణ అవతారం చూసి అలా నుంచుండి పోయింది. బ్రా, లంగా, ఓణీ లాంటిది వేసుకునుంది.

'' ఇవన్నీ గోపాల్ గిఫ్ట్సు !''

నీరజకి నోరు పెగలలేదు.

అన్నపూర్ణ మనసులో ఎత్తులకీ, నిజ జీవితంలో గతుకులకీ, గుంటలకీ పొంతన లేదు. డబ్బు అనేది దేవుడు సృష్టించకపోతే – లేకపోతే మనిషి తయారు చేసుకోకపోతే – దానికీ సుఖానికీ సంబంధం లేకపోతే ఎంత బాగుణ్ణు.....

'' ఆశ్చర్యపోకు. ఈ గదిలో ఫ్యాన్ లేదు. నాకేమో ఉక్క బాధ. ఉక్కా, దోమలూ రెంటినీ తప్పించుకోడానికి సుమారు రోజూ సెకండ్‌షో సినిమాకు పోతాను. అట్నుంచి వచ్చాక ఎక్కడ పడుకున్నా ఇట్టే నిద్ర పట్టేస్తుంది.

నీరజ తేరుకొని గది చుట్టూ కలియచూసింది. ఓ ప్రక్కచాప, ఒక మూల ఒత్తులస్టవ్. దండెంలా కట్టిన తాడు మీద అంచలంచలుగా మాసిన చీరలు – లోపల బట్టలు.

''అరె నువ్ నుంచునే ఉన్నావ్ !''

చాప మీద చతికిలపడింది నీరజ. అక్కడ ఉన్న పుస్తకం తీసి చూపింది – ''బ్రాందీ ఫర్ బ్రేక్‌ఫాస్ట్!''

''ఇదేమిటి ?''

''గోపాల్ ఎక్కడో రైల్వేస్టేషన్లో కొన్నాడట.... మేరీ యే కార్థీ 'గ్రూప్' నిన్ననే అయిపోయింది. మరేదీ లేక ఇది చదువుతున్నా, ఛేజ్, క్రిస్టీ చదివి చదివి విసుగొచ్చింది. మిల్స్ అండ్ బూన్ వయసు దాటి పోయాం....... నా సొదలోనే ఉన్నా.... సారీ ! టీ తాగుతావా ?''

''వద్దులే.... ప్లీజ్! కాసేపు కబుర్లు చెప్పుకుందాం.... ఇప్పుడేం చెయ్యకు...''

–''తలుపు ఎవరో కొడుతున్నట్లుది !'' మెల్లగా వస్తున్న శబ్దం విని నీరజ అంది, కాసేపు మౌనం తర్వాత.

''కాస్త నువ్ తియ్ ! ఎవరో నువ్ చూసి లేనని చెప్పి పంపేయ్ !'' అన్నపూర్ణ లేచి నుంచుంది.

'' ఎవరండీ ?'' తలుపు ఓరగా తెరిచి నీరజ అడిగింది.

''నువ్వేనా అమ్మా అన్నపూర్ణ అంటే ?''

''కాదండీ మీరు ?''

''విశాఖపట్నం నుంచి వచ్చా ! లోపలకు రావచ్చా. నేను అన్నపూర్ణను ఎప్పుడు చూడలేదు. ఆ అమ్మాయి లోపల ఉందా ?''

''లోపలికి రండి !'' అన్నపూర్ణ పిలిచింది. అన్నపూర్ణ అంత తొందరగా చీర ఎలాగు కట్టేసుకోగలిగిందో నీరజకు అంతుపట్టలేదు.

''క్షమించాలి.... మిమ్మల్ని నేనెప్పుడూ చూడలేదు. డాక్టర్ రవీంద్రగారి ప్రయివేట్ క్లినిక్‌లో కంపౌండర్ని. ఆయన కొడుకు గోపాల్. పెద్ద డాక్టర్ గారు నన్ను ఇక్కడకు పంపించారు. వారబ్బాయి గారిని మీరు ప్రేమిస్తున్నారటగా.... అబ్బాయి గారికి పెళ్లి కుదిరింది.''

–తెల్లబోయింది నీరజ.

''అలా కూచోండి. గోపాల్‌నేను క్రిందటి సంవత్సరం పెళ్లి చేసుకొన్నాం. మీ పెద్ద డాక్టర్ గారికి ఆ విషయం తెలుసును అని నాకు తెలుసు.''

''నాకు తెలియదమ్మా ! మీరంటే పెద్ద డాక్టరు గారికి జాలి, అపేక్షా రెండూ ఉన్నాయనే నా నమ్మకం.... మీకు కొంత డబ్బు ఇవ్వాలని అనుకుంటున్నారు. మిమ్మల్ని వచ్చి తీసుకోమన్నారు. ఆయన డబ్బు విషయంలో నన్ను కూడా నమ్మరు. నాతో కూడా తీసుకురమ్మని చెప్పి నన్ను పంపించారు. గోపాల్‌గారు ఢిల్లీలో పెళ్లి చేసుకొని అక్కడి నుంచి ఈ నెలాఖరుకి లిబియా వెళ్లిపోతున్నారు. ఆయన మిమ్మల్ని ఆస్పత్రిలో పరిచయం చేసుకున్నట్లు నాకు తెలుసు. మీకు బొత్తిగా అన్యాయం జరగకూడదు. సామాన్యుడిని. నేను వాళ్ల దగ్గర బ్రతుకుతున్నవాడిని. ఇంతకంటె నేనేం చెయ్యలేను. ఒక అనాధకు అన్యాయం జరుగుతోందని మాత్రం నాకు తెలుసు. మీకు డబ్బు కావాలనుకుంటే నాతో రండి ! 'న్యాయం' 'మంచి' వీటి మీద నేనేం చెప్పే స్థితిలో లేను. నన్ను మీరు అపార్థం చేసుకోరనే నా విశ్వాసం.....''

ఆయన లేచాడు.

అన్నపూర్ణ మాటాడలేదు. ఆయన వెళ్లిపోతుంటే నీరజకి మతిపోయినట్టయింది.

''నీరజా ! ప్లీజ్! ఏం ? అలా ఉండిపోయావేం ? మాట్లాడు. నీరజా మాటాడు. సే సమ్ థింగ్ ! ఏనీథింగ్ యూలైక్ !...... నాలో విచారం ఏమాత్రం లేదు. ఇది ఇలా జరుగుతుందని నాకెప్పుడో తెలుసు. నాలో ఆవేశం లేదు. ఆలోచన లేదు. ఆలోచించే మనుషులకు విషాదం తప్ప మరేం మిగలదు. తెలుసుకోవాల్సింది సంపూర్ణంగా తెలుసుకున్న వాళ్లకి విషాదం ఉండదు. నిర్లిప్తతే ఉంటుంది.... నీరజా, మాటాడు నీరజా, ఏదైనా సరే !''

నీరజ సమాధానం చెప్పలేకపోయింది. చెప్పడానికి ఏమీలేక, చేష్టలుడిగా అలా ఆమె వంకే చూస్తూ ఉండిపోయింది.

''నీరజా నువ్ నా గురించి ఏమనుకొంటున్నావ్? ఊరికే ఎకడమిక్ ఇంటరెస్ట్‌తో అడిగా అంతే. సమాధానం ఆశించి కాదు. ఆస్పత్రి బెడ్ నుంచి, స్విమ్మింగ్‌పూల్...... స్కేటింగ్ రింక్... కులాసాగా చిలకల్లా ఆనందంగా, నిర్విచారంగా తిరిగాం. అనాధయిన నన్ను చేరతీసి పెంచిన బంధువులతో

నాకు పోసగలేదు. వాళ్లకు దూరమయ్యాను.... మామూలుగా జీవించడం కంటె చిలకలా ఎగరడం నాకిష్టం. నాకు పెళ్లయింది. నిజంగా.... గోపాల్‌తో.... ఎవరు నమ్మకపోయినా నువ్ నమ్ము. నమ్ముతావనే నా ఆశ. గోపాల్‌కి నేనంటే ప్రేమ. అంతకంటె ఎక్కువ తండ్రంటే భయం.... కాని నేను ఎప్పటికయినా ఆ భయాన్ని నా ప్రేమతో జయిస్తానని ఆశించాను. కాని నేను ఓడిపోతున్నానని నాకు తెలుసు. గోపాల్ రెండు నెలలుగా నాకు ఉత్తరం వ్రాయలేదు. కాబట్టే ఈ ఊరు వచ్చి ఈ ఉద్యోగంలో చేరాను. గోపాల్ కోసం ఆనందంగా, విలాసంగా, ఆరోగ్యంగా కనపడాలని అనుకున్నాను. ఇక నాకు అపేక్షలేం లేవు. ఐయామ్ సారీ ఫర్ దిస్ బ్యాడ్ ఎంటర్‌టయిన్‌మెంట్! కొన్ని జీవితాలంతే... ఎందుకు పుట్టామో, ఏం సాధిస్తామో తెలియదు'' వేదాంతిలా నవ్వింది అన్నపూర్ణ.

''నువ్వేం చేస్తావ్?'' అని అడగాలనుకుందే గాని అడగలేకపోయింది నీరజ. అన్నపూర్ణకి తక్షణం కావల్సింది ఏకాంతం.... వెంటనే నీరజ ఇంటికొచ్చేసింది.

-మరుసటిరోజు. స్కూల్లో ఒక దారుణమైన వార్త. అన్నపూర్ణని ఉద్యోగంలోంచి తీసేసారు. పాఠాలు బాగా చెప్పడం లేదని కాదు. బి. ఈడి. ట్రెయినింగ్ లేదు కాబట్టి. అన్నపూర్ణ స్కూలుకి రాలేదు. శలవు చీటీ పంపించింది.

సాయంకాలానికి అన్నపూర్ణ శవాన్ని పోలీసులు కనుక్కున్నారు. ఆమె స్వదస్తూరీతో నీరజకి రాసిన ఉత్తరం వాళ్లు తీసుకొని ఫోటోస్టాట్ కాపీ నీరజకిచ్చేశారు.

''నీరజా,

నేనెవరో నీకు తెలియదు. నేనంటే నీకు అభిమానం అని నా మనసు చెబుతోంది. నామీద ఎవరయినా అభిమానం చూపిస్తే నాకు ఆశ్చర్యమే కలుగుతుంది. ముందు పక్షిలా గాలిలో ఎగరాలనుకున్నా, చిలకలా ఉన్నా, చిలకలా ఉందామనుకున్నా.

కాని చిలకకి ఒకపంజరమయినా కావాలి. ఒక గూడయినా కావాలి. పంజరం బ్రతుకు అందంగా ఉండకపోయినా కొంత వరకు రక్షణ అయినా ఉంటుంది. గూడు నాలాటి అభాగినులకు ఎలా చెప్పు ?

చిన్నతనంలోనే అన్ని పోగొట్టుకొన్నాను. నాకు గూడు లేదు. పంజరం దొరుకుతుందని పెళ్లి చేసుకున్నాను. కాని పంజరం దొరకడం కూడ చిలకకు అదృష్టమేనేమో !

నా కోసం విచారించకు. ఏనాటికయినా గోపాల్‌కి ఈ ఉత్తరం జతచేసి ఓ చీటి వ్రాయి. నేను ఈ ఉత్తరం ఆయనకు పంపమన్నానని ఒక్కముక్క చాలు. లెట్ హిమ్ లివ్ హేపీలీ !

నాకు డబ్బెందుకు ! ఆ కాంపౌండరు కంటె, ఆ తండ్రి కంటే, ముందు గోపాల్‌కి ఆ ఆలోచన వచ్చి ఉంటుంది. గోపాల్‌ది చాలా జాలి గుండె. ఎ వెరీ స్వీట్ యంగ్‌మాన్!.... ప్రపంచం సంగతి తెలిసే గోపాల్ ఇచ్చిన నిద్ర మాత్రలను విమోచన సాధనంగా పదిలపరుచుకున్నాను.

ఎగిరిపోతున్న చిలక,
నీ అన్నపూర్ణ.

విశాఖ వెళదామనుకొని బస్ స్టాండ్‌కి వచ్చిన నీరజ ఎందుకో చటుక్కున ఆ ప్రయత్నం విరమించుకొని ఇంటి దోవ పట్టింది.

**ఆంధ్రసచిత్ర వారపత్రిక**

23-11-1984